క్లుప్తంగా

తప్పుడు ప్రచారం నమ్మొద్దు

అశ్వాపురం: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుపై తప్పుడు ప్రచారాలను పార్టీ శ్రేణులు, ప్రజలు నమ్మొద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ సూచించారు. అశ్వాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీలోకి వెళ్తున్నారని రేగాపై తప్పులు ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో పినపాక గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు.

మంత్రి తుమ్మల నివాళి

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పొన్నగంటి సూర్యనారాయణ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందగా.. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. గురువారం మంత్రి నాగుపల్లి గ్రామానికి చేరుకుని మృతుడి భౌతికకాయానికి పూలమాలతో నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, యర్రగొర్ల రాధాకృష్ణ, ఎర్రా వసంతరావు, ఎల్లిన మురళి తదితరులు పాల్గొన్నారు.

సంత వేలం మళ్లీ వాయిదా

చర్లరూరల్: చర్ల మేజర్ గ్రామ పంచాయతీ బహిరంగ వేలం పాటలు గురువారం పంచాయతీ కార్యాలయం మార్కెట్ ఆవరణలో నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని కొన్ని రూములు, జంతువధ రుసుము వేలం నిర్వహించారు. అనంతరం పశువుల సంత వేలం నిర్వహించినప్పటికీ.. సాయంత్రం వరకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రాకపోవడంతో శనివారానికి వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణ ప్రకటించారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో కొలువుదీరిన బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి 28 వరకు జరగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ మేనేజర్ రమణ కోరారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన బ్రహ్మోత్సవ వివరాలను వెల్లడించారు. ఈ నెల 25వ తారీకు రాత్రి పది గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వనమా గాంధీ, కమిటీ సభ్యులు రుంజా బుచ్చమ్మ, నేరళ్ల లాలయ్య, రాజా, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సుంకు జాతర

చర్ల: ఈ నెల 26 నుంచి మండల కేంద్రంలోని లక్ష్మీకాలనీలో ఉన్న గుట్టపై రేణుకా ఎల్లమ్మ, నాగులమ్మల సుంకు జాతరను నిర్వహించనున్నట్లు ఆలయ తలపతి మడకం నాగేశ్వరరావు, పూజారి మడకం దేవయ్య గురువారం తెలిపారు. 26న మంగళవారం సాయంత్రం 4 గంటలకు అమ్మవార్లు గద్దెలపైకి వస్తారని, 27న బుధవారం ఉదయం 8 గంటలకు రేణుకా ఎల్లమ్మ వారి ప్రధాన పూజాఘట్టం ప్రారంభమవుతుందని తెలిపారు. 28న గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమ్మవార్ల దర్శనాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల తరువాత అమ్మవార్లు తిరిగి వన ప్రవేశం చేస్తారని వివరించారు.

చైర్మన్ ఎన్నిక చెల్లదు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ నూతన చైర్మన్ ఎన్నిక చెల్లదని ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చుక్కా గణేష్‌రెడ్డి, బైరెడ్డి సతీష్‌రెడ్డిలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆలయ అవరణలో జరిగిన సమావేశంలో గత జాతర ఉత్సవాల ఆలయ జమ, ఖర్చుల గురించి మాత్రమే నని చర్చించాల్సిందిపోయి ఎన్నికలు నిర్వహించారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం.. నూతన కమిటీని గ్రామసభలో స్టీరింగ్ కమిటీ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మణుగూరు సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికుడు కుంట రవికి ఏరియా సివిల్ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు రూ.16వేల ఆర్థిక చేయూతనందించారు. అలాగే తోటి కాంట్రాక్ట్ కార్మికులు క్వింటా బియ్యాన్ని విరతణగా అందించారు. ఈ వితరణను ఏరియా ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. దాతలను ఆయన అభినందించారు.

ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని దత్తశేషసాయి ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా బాబా వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం పూజలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మొక్కుబడిగా గ్రంథాలయ నిర్వహణ

- పాత పుస్తకాలతోనే కాలం వెళ్లదీత
- పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల కొరత
- తాగునీరు, టాయిలెట్ వసతుల కరువు



బూర్గంపాడులోని శాఖా గ్రంథాలయం

బూర్గంపాడు: మండల కేంద్రంలోని గ్రంథాలయం నిర్వహణ మొక్కుబడిగా మారింది. రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవటంతో గంథ్రాలయం నిర్వహణ తూతూ మంత్రంగా సాగుతోంది. ఈ గ్రంథాలయానికి 2015లో వచ్చిన పుస్తకాలే తప్ప తొమ్మిదేళ్లుగా కొత్త పుస్తకాలు మాత్రం రావటం లేదు. పోటీ పరీక్షలకు అవసరమైన కరెంట్ ఆఫైర్స్, జనరల్ నాలెడ్జి పుస్తకాలు అందుబాటులో లేకపోవటంతో విద్యార్థులు లైబ్రరీకి వచ్చేందుకు సుముఖత చూపటం లేదు. 40 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ లైబ్రరీలో ఎప్పటివో పాత పుస్తకాలే తప్ప కొత్త పుస్తకాలు లేవు. గోదావరి వరదల సమయంలో ఈ పుస్తకాలను మూటగట్టి పక్కకు పెట్టుకోవటం, వరదల అనంతరం తీసి షెల్ఫ్‌లలో సర్దుకోవటం పరిపాటిగా మారింది.

గత ఐదేళ్ల క్రితం వరకు మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులు ఉదయం, సాయంత్రం ఈ గంథ్రాలయానికి వచ్చి వారికి కావాల్సిన పుస్తకాలను చదువుకునేవారు. స్థానికులు కూడా ఉదయాన్నే దినపత్రికలు, వారపత్రికలు చదివేందుకు లైబ్రరీకి వచ్చేవారు. మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో పుస్తక ప్రియులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివేవారు. గత ఐదేళ్లుగా గ్రంథాలయం సరిగా తెరవకపోవటంతో పుస్తక ప్రియులు లైబ్రరీకి వెళ్లేందుకు ఆసక్తి చూపటం లేదు. కొంతకాలంగా వారానికి ఒకరోజు (మంగళవారం) మాత్రమే లైబ్రరీ తలుపులు తెరిచేవారు. ఇటీవల మాత్రం మొక్కుబడిగా రోజు కొంత సమయం పాటు లైబ్రరీలో స్వీపర్‌గా పనిచేసే వ్యక్తి తలుపులు తీస్తున్నారు. లైబ్రరీలో ప్రస్తుత కాలానికి అనువైన పుస్తకాలు లేకపోవటంతో యువత లైబ్రరీలో వెళ్లటం లేదు. లైబ్రరీలో ఉన్న పుస్తకాలు కూడా చాలా ఏళ్ల క్రితం నుంచి ఉన్న పుస్తకాలు కావటంతో పేజీలు మరకలు పడి, చినిగి పోతున్నాయి. ప్రస్తుతం లైబ్రరీకి వచ్చే ఐదారుగురు కూడా కేవలం ఐదు, పదినిమిషాలు దినపత్రికలను తిరగేయటం తప్ప పుస్తకాల జోలికి వెళ్లటం లేదు.

ఈ లైబ్రరీలో తాగునీటి వసతులు లేవు. ఫ్యాన్లు సరిగా పనిచేయవు. టాయిలెట్లు ఊసే లేదు. ఎవరైనా పుస్తక పఠనం పట్ల ఆసక్తి ఉండి గంథ్రాలయానికి వచ్చిన అక్కడ వసతులు సరిగా లేకపోవటంతో అసంతృప్తిగా వెనుదిరుగుతున్నారు. ఇప్పటికే సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లతో యువత గ్రంథాలయాలకు దూరమవుతుంటే.. దానికి తోడు గ్రంథాలయాల నిర్వహణ తీరు ఈ పరిస్థితికి మరింత ఊతమిస్తోంది. ప్రభుత్వం గ్రంథాలయాను డిజిటలైజేషన్ చేసి ప్రస్తుత యువతకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా పోటీ పరీక్షలకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్స్‌ను అన్ని గ్రంథాలయాలలో అందుబాటులో ఉంచాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

డిజిటల్ లైబ్రరీగా అప్‌గ్రేడ్ చేయాలి

ప్రస్తుత కాలానికి అనుగుణంగా మండల కేంద్రాల్లోని లైబ్రరీలను అప్‌గ్రేడ్ చేస్తు డిజిటలైజేషన్ చేయాలి. గ్రంథాలయాల ఉద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రజల మౌలిక అవసరాల్లో గ్రంథాలయాలకు కూడా చోటు కల్పించి అభివృద్ధి చేయాలి. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా చూడాలి.

– కేవీ రమణ, సామాజిక కార్యకర్త, బూర్గంపాడు

అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

గ్రంథాలయాలలో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. పుస్తకాల కొనుగోలుకు, గ్రంథాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. లైబ్రరీలలో పుస్తక పఠనానికి అనువుగా వసతులు కల్పించాలి.

– బర్ల తిరుపతిరావు, జనవిజ్ఞాన వేదిక బాధ్యుడు

కల్యాణోత్సవాలకు దేవాలయాల ముస్తాబు

చర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయాలు కల్యాణోత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 25న హోలీ వేడుకల్లో భాగంగా నిర్వహించే వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు మండలంలోని దేవానగరంలోని అలివేలు, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి దేవాలయం, కుదునూరు గ్రామాల్లోని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయాలకు రంగులు దిద్దుతూ విద్యుద్దీపాలంకరణలు చేస్తున్నారు. దేవాలయాల ప్రాంగణాల్లో చలువ పందిళ్లు, ఇతర ఏర్పాట్లలో ఆలయ కమిటీలు ఉన్నారు. దేవానగరం, కుదునూరు గ్రామాల్లో కల్యాణం అనంతరం అన్నదానాలు ఏర్పాటు చేయనున్నారు.


కల్యాణానికి ముస్తాబవుతున్న కుదునూరులోని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయం

బార్ అసోసియేషన్ ఏకగ్రీవం

దమ్మపేట: దమ్మపేటలో ఇటీవలే నూతనంగా ఏర్పాటైన కోర్టులో న్యాయవాదుల అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. గురువారం దమ్మపేట కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మారం సతీష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ముప్పిడి శ్యాంసుధాకర్, జనరల్ సెక్రటరీగా గొంది మురళీమోహన్, ట్రెజరర్‌గా బాలరాజు, సెక్రటరీగా లక్కినేని నరేంద్రబాబులను ఎన్నికయ్యారు. నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గానికి, సీనియర్ న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాసరావు, మడుపు వెంకటరమణ, శ్రీనివాస రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

భద్రాచలంలో ఎన్నిక షెడ్యూల్ విడుదల..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషకు 2024–25 సంవత్సరానికిగాను ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం స్థానిక కార్యాలయంలో ఎన్నికల అధికారులు విద్యాసాగర్, నాగ అంబేడ్కర్ విడుదల చేశారు. నేడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంటల మధ్య బార్ అసోసియేషన్ కార్యాలయంలో నామినేషన్‌లు పొందే, ఇదే రోజు సమర్పించాల్సి ఉంటుందన్నారు. 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ ఉండగా..అదే రోజు సాయంత్రం పోటీచేసే అభ్యర్థుల ఫైనల్ లిస్టును నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. పోలింగ్ ఈనెల 30న శనివారం ఉంటుందని, అదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఓట్లు లెక్కించి రాత్రికి ఫలితాలను వెల్లడిస్తారని తెలిపారు.

పొంగులేటి సతీమణి పరామర్శ

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి మాధురి రెడ్డి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. గురువారం ఆమె సుధాపల్లి గ్రామంలో ఇటీవలే మరణించి మల్లూరు నాగరత్నం చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో కోటగిరి యుగంధర్ మాతృమూర్తి అనారోగ్యంతో బాధపడతుండగా.. ఆమెను పరామర్శించారు. మరోవైపు మండలంలోని పట్వారీగూడెంలోనూ మాధురి రెడ్డి పర్యటించారు. పలువురిని పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో సత్తుపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్ పద్మజ్యోతి, కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, చిన్నశెట్టి యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, జూపల్లి ప్రమోద్, ఉపేంద్రబాబు, సాయిల నర్సీ, పగడాల రాంబాబు, కక్కిరాల రమేష్, పర్వతనేని ప్రసాద్, చిట్టినాయన, వాసం శ్రీను, ఈశ్వరప్రగడ భూషణ్, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి కుర్చీల వితరణ

భద్రాచలంఅర్బన్: ఐటీసీ బీఎంఎస్ సౌజన్యంతో దాదాపు రూ.లక్ష విలువ గల 12 కుర్చీలను గురువారం భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణకు వితరణ అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ రేష్మ శర్మ పాల్గొని మాట్లాడారు. అనంతరం మహిళా సమితి సభ్యులను డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. భద్రాద్రి మహిళా సమితి సభ్యులు లక్ష్మి, అంజుతమక్, ప్రతిభా, చిన్ని, లావన్య, సుహాసిని, శ్రీదేవి, ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్ రావు, ఏరియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వైద్యుడు మృతి

మణుగూరురూరల్: మణుగూరు పట్టణానికి చెందిన భారతి క్లీనిక్ అధినేత డాక్టర్ తిరుపతిరావు బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతుండగా.. గురువారం హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరం


చర్లరూరల్: లక్ష్మీకాలనీలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చర్లరూరల్: మండలంలోని లక్ష్మీకాలనీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైరల్ జ్వరాలతో పాటు కీళ్ల, ఒళ్ల నొప్పులతో బాధపడుతున్న 45 మందికి హోమియోపతి వైద్యురాలు పూజ వైద్య చికిత్స అంది చారు. అందులో ఐదుగురికి జ్వరాలు ఉండడంతో వారికి మందులను పంపిణీ చేశారు. వైరల్ జ్వరాలు సోకుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ఏఎన్‌యం స్వరూప, ఆశా కార్యకర్త కుమారి తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యశిబిరం..

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న నల్లబల్లి గ్రామంలో పర్ణశాల హోమియోపతి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు, ఉన్న వారిని పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం హోమియోపతి వైద్యం ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది మెహబూబ్, ఆశ కార్యకర్తలు చల్లమ, వెంకట లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు సంత వేలం పాట

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట గ్రామంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారపు సంతలో బహిరంగ వేలం పాటను రేపు (శనివారం) నిర్వహించనున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ గురువారం యో ప్రకటనలో తెలిపారు. వారపు సంతలో దుకాణాలకు అద్దె వసూలు చేసుకునే నిమిత్తం రేపు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీఓ రామారావు సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించబడునని తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.10 వేల డిపాజిట్ సొమ్మును చెల్లించాలని, పాట ప్రారంభ ధర రూ.1,45,000లు ఉంటుందని తెలిపారు.

ఘనంగా రణాసురుడి జాతర

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని మర్కోడు పంచాయతీ నడిమిగూడెం గ్రామంలో రణాసురుడు జాతర ఘనంగా జరిగింది. పాయం వంశీయుల ఆధ్వర్యంలో ఈ జాతరను గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం అంగరంగవైభవంగా జరుపుతున్నారు. బుధవారం దేవుడిని గుట్ట నుంచి గర్భగుడికి తీసుకరావడంతో జాతర ప్రారంభమైంది. వన దేవతను డప్పువాయిద్యాలతో, గిరిజన నృత్యాలతో తీసువచ్చారు. రాత్రి ఆయా దేవతలకు గంగాస్నానం చేయించారు. అనంతరం గద్దెలపై ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఆయా దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించడంతో నిండు జాతర మొదలైంది. వడ్డెలు, తలపతులు, పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు పూనకాలతో నృత్యాలు చేశారు. జాతరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాకా ఇతర మండలాల నుంచి వందల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.


గుట్ట నుంచి వన దేవతను తీసుకొస్తున్న భక్తులు

ముమ్మరంగా 'పోషణ పక్వాడ'


భద్రాచలంఅర్బన్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


మణుగూరురూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మణుగూరు–3 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి హాజరై పోషకాహారంపై గర్భిణులకు, పిల్లల తల్లులకు, బాలింతలకు పలు సూచనలు చేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం పోషణ పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. తొలుత ఇంటి వద్ద తయారు చేసి తీసుకొచ్చిన వివిధ రకాల ఆహారపదార్థాలను సీడీపీఓ పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాజలం అన్నారు. గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన జరిపించారు. చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లిపాలు, ఏడు నెలల నుంచి అదనపు ఆహారం అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పార్వతి, శివ, కుమారి, విజయ, లావణ్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: గర్భిణులు, బాలింతలు ఖచ్చితంగా పోషకాహాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.నాగమణి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలపరిధిలోని జగన్నాథపురం–2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్‌పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహార అవశ్యకతను వివరించారు. సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారికి అన్నప్రాసన చేశారు. పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, సీహెచ్‌ఓ సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోనూ ఇవే కార్యక్రమాలు జరిగాయి.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రైతు వేదిక వద్ద గురువారం స్థానిక సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ నవ్యశ్రీ పలు సూచనలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాష్, సఖీ కేంద్రం నిర్వాహకులు సుభాషిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం


చర్లరూరల్: ఎదిర గుట్టల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న అటవీశాఖ సిబ్బంది


మణుగూరురూరల్: పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది


భద్రాచలంఅర్బన్: గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న డాక్టర్ కృష్ణ ప్రసాద్


మణుగూరురూరల్: అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం..


అశ్వాపురం: కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు

చర్లరూరల్: అడవుల రక్షణ తామందరి బాధ్యత అని చర్ల ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఉపేంద్ర అన్నారు.ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా.. మండలంలోని ఎదిర గుట్టల వద్ద అటవీ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఇటీవల ఎదిర గుట్టల వద్ద జరిగిన జాతర సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా అడవిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీశాఖ సిబ్బంది సేకరించి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. శుభ్రం చేశారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: రోజురోజుకూ విచ్చలవిడిగా వాడకం పెరుగుతున్న ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉందని, ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు సహకరించాలని అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజర్ మురళీ కోరారు. గురువారం మండలంలోని గోగులపూడి అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయ ఆవరణంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా సిబ్బంది, భక్తులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పర్యావరణాన్ని పరిరక్షించడం తామందరి బాధ్యత అని మణుగూరు ఎఫ్ఆర్ఓ ద్వాలియా అన్నారు. ప్రపంచ అటవీ శాఖ దినోత్సవం సందర్భంగా మణుగూర్ ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మొహియుద్దీన్ ఆదేశాల మేరకు అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం అటవీశాఖ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పాటై పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు సలూజ, మిలాదున్, ఎఫ్‌బీఓలు, స్ట్రైకింగ్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: మొక్కలు నాటడమే ఉత్తమ మార్గమని డాక్టర్ కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా భద్రాచలం గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కృష్ణ ప్రసాద్ పాల్గొని బ్రిడ్జి సెంటర్‌లోని ఆయాంజనేయ స్వామి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. గీన్ భద్రాద్రి అధ్యక్షుడు బెల్లంకొండ రాంబాబు, కోశాధికారి విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గొళ్ల భూపతి రావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, రాజు పాల్గొన్నారు.

అశ్వాపురం: ప్రతి విద్యార్థి ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నకుమారి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం కళాశాల నుంచి మిట్టగూడెం వరకు ర్యాలీ నిర్వహించారు. అడవుల విశిష్టతపై ప్రజలకు వివరించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో..

ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ రమేష్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మొక్కల పెంపకం, అడవుల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు బహుమతుల అందజేత

మణుగూరురూరల్: ఇటీవల నిర్వహించిన సింగరేణి 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా రక్షణ సూత్రాలు పాటించడంలో, అమలు చేయడంలో మార్గదర్శకంగా నిలిచిన 24మంది రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు, టీం లీడర్లకు ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు గురువారం బహుమతులు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో రైల్వే ట్రాక్ సైడింగ్ నిర్వహణతో పాటు రక్షణతో పని చేయాలన్నారు. భవిష్యత్‌లో రక్షణ సూత్రాలను విస్మరించవద్దని, ఆ మేరకు పాటించిన వారిని సంస్థ గుర్తిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్పీ రాజేంద్రప్రసాద్, అధికారులు సిద్ధిరాములు, పాత్రు, ఈఈ ప్రవీణ్, సూపర్‌వైజర్లు నవీన్, భరత్, సుధాకర్, రవి, దశరథ్, కాంట్రాక్టర్లు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కనపడుటలేదు


పోటు నరేష్

ఈ ఫోటోలోని వ్యక్తి పేరు : పోటు నరేష్, తండ్రి: రాఘవులు, వయస్సు: 31 సం॥లు, ఎత్తు: 5.5 అడుగులు, రంగు : చామన ఛాయ మార్చి నెల 10వ తేదీ నుండి కనపడుటలేదు. ఈ వ్యక్తి ఇంటి నుండి వెళ్ళేటప్పుడు స్కై బ్లూకలర్ టీషర్ట్, బ్లాక్ లోయర్ ధరించి ఉన్నాడు. ఆచూకి తెలిసినవారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: పోటు కళ్యాణి, W/o. పోటు నరేష్, పోటు రాఘవులు (తండ్రి) శివలింగాపురం, మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. సెల్: 6300219849, 9553389459, 9441836552.